## క్లుప్తంగా

### రహదారిపై గోతుల పూడ్చివేత



గోతులపై సిమెంట్ కాంక్రీట్ వేయిస్తున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను పోలీసుసిబ్బంది ఆధ్వర్యంలో కూలీలు బుధవారం పూడ్చారు. ఈ మేరకు ఎస్సై కె. నీలకంఠం మాట్లాడుతూ వాహనాల రద్దీ, కురుస్తున్న వర్షాల కారణంగా సిమెంట్, తారు రోడ్లపై గోతులు ఏర్పడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు తమవంతుగా సిమెంట్ కాంక్రీట్‌తో గోతులను పూడ్చడానికి చర్యలు చేపట్టామన్నారు.

### నాడు-నేడు పనుల పరిశీలన



నారాయణపురంలో పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు నారాయణపురం ఉన్నత పాఠశాల, గౌరీపురం అంగన్వాడీ భవనం పనులను ఆయన బుధవారం పర్యవేక్షించారు. నారాయణపురం ఉన్నత పాఠశాలలో 6గదుల నిర్మాణాలను పరిశీలించి వాటిని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా త్వరగా నిర్మాణాలు పూర్తిచేస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. పనులలో ఎక్కడా నాణ్యతాప్రమాణాలు తగ్గరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### వేడుకగా శ్రీనివాస కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: పట్టణంలోని రాయగడ రోడ్డు పరిధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో బుధవారం శ్రీనివాసకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు ఆలయ అర్చకులు కుమారభట్టర్, గోపీనాథాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన కల్యాణంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కల్యాణం సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు హితవు పలికారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, థియేటర్‌ల వద్ద ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్స్, అజాగ్రత్తతో ధూమపానం చేయడం తదితర కారణాలతో అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలి అనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో థియేటర్ యజమాని గిరి రఘు, సిబ్బంది, అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, నాగరాజు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

### చిన్న పిల్లలకు గడువులోగా టీకాలు వేయాలి



పిల్లలకు ఆరోగ్యంపై బాలింతలకు వివరిస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

సీతానగరం: చిన్నారులు, విద్యార్థుల్లో రక్తహీన నివారణకు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన చినబోగిలిలో వైద్యాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన గడువులోగా ఆయాగ్రామాల్లో వైద్య సిబ్బంది వేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# గిరిశిఖరాన 'గడగడపకు మన ప్రభుత్వం'

- జోరువానలో కాలినడకన వెళ్లిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- ధింసా నృత్యాలతో స్వాగతం పలికిన గిరిజన మహిళలు



గిరిశిఖర గ్రామం చిలకమెండంగి గ్రామానికి కాలినడకన చేరుకుంటున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ఎత్తైన కొండలు, రహదారి సౌకర్యం అంతంత మాత్రమే, మరోవైపు జోరువాన, ఒకప్పటి మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం, అటువంటి గిరిశిఖర గ్రామాలలో డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర బుధవారం పర్యటించారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ చిలకమెండంగి గ్రామంలో ముందుగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బాగుజోల గ్రామం నుంచి సుమారు 5కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండలపై ఉన్న చిలకమెండంగి గ్రామానికి డిప్యూటీసీఎం రాజన్నదొర తన కాన్వాయిపై బయల్దేరారు. జోరున వర్షం కురుస్తుండడం, రహదారిపై పెద్ద పెద్ద రాళ్లు తేలిపోయి, బురదమయం కావడంతో వాహనాలు ముందుకు సాగలేదు. ఎలాగైనా చిలకమెండంగి గ్రామం వెళ్లాలన్న సంకల్పంతో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడులతో కలిసి కాలినడకన గ్రామానికి చేరుకున్నారు.

**అడుగడుగునా స్వాగతం పలికిన గిరిజనులు**

గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన డిప్యూటీసీఎం రాజన్నదొరకు గిరిజన మహిళలు ధింసానృత్యాలు, మేళతాళాలతో స్వాగతం పలికారు. పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించారు. డిప్యూటీసీఎం రాజన్నదొర గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం చేయడంతో సందడిగా మారింది. చిలకమెండంగి, బాగుజోల, మెండంగి, ఆలగురువు, గుంటభద్ర, మూలవలస, దుగ్గేరు గిరిజన గ్రామాలలో గడపగడపకూ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. చిలకమెండంగి, బాగుజోల గ్రామాలకు చెందిన గిరిజనులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సింహాచలానికి రాజన్నదొర సూచించారు. మెండంగి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జోగారావును కోరారు. రేషన్‌కార్డులు లేనివారి పేర్లు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు పొందని గిరిజన మహిళల వివరాలును స్వయంగా డిప్యూటీసీఎం రాజన్నదొర నమోదుచేసుకొని, లబ్ధిదారుల ఆధార్‌కార్డు ఫొటోలను తన సెల్‌ఫోన్‌లో తీసుకున్నారు. ఆలగురువు గ్రామంలో దివ్యాంగులతో ముచ్చటించారు. మెండంగిలో అంగన్వాడీ చిన్నారులతో మాట్లాడి, పాలు, గుడ్లు అందిస్తున్నారా, లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.



బాగుజోలలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

### మన్యం అందాలతో ఫొటో



చిలకమెండంగి గ్రామరహదారి మధ్యలో రాయిపై నిలబడి ఫొటో దిగుతున్న రాజన్నదొర

చుట్టూ దట్టమైన అడవి, మేఘాలను తాకేలా ఉండే కొండలు, వాటిపై తేలియాడే వెండిమబ్బులు ఇంతటి ప్రకృతి రమణీయమైన దృశ్యాలను చూస్తే ఎంతటివారైనా ప్రకృతి అందాలకు మంత్రముగ్ధులు కావాల్సిందే. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో జోరుగా వర్షాలు కురుస్తున్నందున ఏజెన్సీలో ప్రకృతి అందాలు మైమరిపిస్తున్నాయి. గిరిశిఖర గ్రామమైన చిలకమెండంగిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, ఎత్తైన కొండలు, చుట్టూ పచ్చనిసోయగం, కొండలపై పరుగులుతీస్తున్న వెండిమబ్బులను చూసి మంత్రముగ్ధుడై జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, రంగునాయుడులతో కలిసి ఫొటోలు దిగారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ బడ్నాన ప్రమీల




సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌డీఎస్ కమిటీ ఛైర్‌పర్సన్ బడ్నాన ప్రమీల

పాచిపెంట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ బడ్నాన ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విధివిధానాలపై పాచిపెంట, గురువు నాయుడుపేట, పీహెచ్‌సీల వైద్యాధికారుల సమక్షంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి సచివాలయాల వారీగా హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. హెల్త్ క్యాంప్ నిర్వహించడానికి వారం రోజుల ముందు నుంచి ఆయా గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వ్యాధి తీవ్రతను బట్టి వారికి అవసరమైన వైద్యం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పార్వతి, పాచిపెంట, గురువు నాయుడుపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యభద్రత



మాట్లాడుతున్న డ్వామా పీడీ ఎస్.రామచంద్రరావు

సీతానగరం: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్య భద్రత కల్పించడం కోసం గ్రామాల్లో నిర్వహించే సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని డ్వామా పీడీ, సీతానగరం మండల ప్రత్యేక అధికారి ఎస్. రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్య శాఖ అధికార సిబ్బందికి ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్య భద్రత కల్పించడానికి తహసీల్దార్, ఎంపీడీఓ ,వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది ,గృహసారథులు, గ్రామ వలంటీర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి దశల వారీగా నాలుగు విడతలుగా గృహసందర్శన సర్వే చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు ఎవరికి ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలున్నాయి? ప్రస్తుతం ఏరకమైన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకుని నిర్దేశించిన యాప్‌లో పొందుపర్చాలని సూచించారు.

**మూడు విడతల్లో సర్వే**

డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు మాట్లాడుతూ వ్యాధుల బారిన పడిన వారికి వారిళ్లలోనే వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిగ్రామంలోముందుగా ప్రజలకు అవగాహన కల్పించిన అనంతరం మూడు విడతల్లో సర్వేనిర్వహించి నాలుగో విడతలో గ్రామాల్లో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, నిపుణులైన వైద్యాధికారులు ఇద్దరు వంతున ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి రోగనిర్ధారణ అయి వ్యాధి తగ్గినంతవరకూ వైద్యాధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సేవలందిస్తారని తెలియజేశారు. జగనన్న సురక్ష వైద్య శిబిరాలకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శిరీష, ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ జి సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పీజీ కళాశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సు అందుబాటులో ఉందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీజీసెట్-23లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కళాశాలలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు కళాశాలలో పీజీ కో-ఆర్డినేటర్ రమేష్ 9989849494 ఫోన్ నంబరును సంప్రదించాలని వివరించారు.

## ఓటరు జాబితా పరిశీలన పూర్తి చేయాలి



ఓటర్ల జాబితా వివరాలను రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పాచిపెంట: ఓటరు జాబితా పరిశీలన సకాలంలో పూర్తి చేయాలని నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్ అన్నారు. ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఓట్ల చేర్పులు, తొలగింపులపై తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా పక్కాగా ఉండాలని, తొలగిస్తున్న ఓటరు వివరాలు ఆయా కుటుంబాలకు తెలియజేసి నిర్ధారించుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణం పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, ఎలక్షన్ ఆపరేటర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయశాఖ పర్యవేక్షణలో ఎరువుల విక్రయాలు

సీతానగరం: మండలంలో లైసెన్స్ కలిగిన ఎరువుల విక్రయాల నిర్వాహకులు వ్యవసాయ శాఖ నుంచి అనుమతులు తీసుకుని విక్రయించాలని ఏఓ ఎస్. అవినాష్ కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు అవసరమైన ఎరువులు ఉన్నాయని రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా కృత్రిమ ఎరువుల కొరత కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మీరే జగనన్న సైన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- సోషల్‌మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం



సమావేశానికి హాజరైన సోషల్ మీడియా ప్రతినిధులు

పార్వతీపురంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్మించిన సంక్షేమ సామ్రాజ్యంలో సోషల్ మీడియా కార్యకర్తలంతా ఓ సైన్యంలా పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా 600మంది సోషల్ మీడియా కార్యకర్తలతో పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగనన్న నిర్మించిన సంక్షేమ సామ్రాజ్యంలో మనమందరం పెద్ద యంత్రాంగంలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే మన ప్రాంత స్థితిగతులు మరింత మెరుగుపడతాయని, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంతోమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయంటే దానికి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనే కారణమన్నారు. ప్రభుత్వం తరపున చేస్తున్న కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కలిగేవిధంగా ప్రసారం చేయాలని దిశానిర్దేశం చేశారు.

**వాస్తవాలను సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంపై చూపించాలి**

గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. మన ఏవిధంగా ప్రజలకోసం కష్టపడి పనిచేస్తున్నామో అనే విషయాన్ని ప్రజలకు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రజల ముందుకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తీసుకువెళ్లి వారి మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌ఛైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ యాదగిరి, మూడు మండలాలు, పురపాలకసంఘం జేసీఎస్ కన్వీనర్లు, సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు అండగా ప్రభుత్వం**

జవసత్వాలు కోల్పోయి ప్రభుత్వంపై ఆధారపడే ప్రతి ఒక్క అవ్వాతాతకు, అక్కాచెల్లెమ్మకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో వయోవృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా పురపాలకసంఘం పరిధిలో 312 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పి వాటిని లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ఛైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్‌ఛైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కమిషనర్ జె. రామప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు నేత్ర పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 11నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలలో 8మంది విద్యార్థులకు దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించి వారికి కళ్ల జోళ్లకు సిఫారసు చేసినట్లు, త్వరలో జరగనున్న జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాలలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇతరత్రా వ్యాధులకు మందులు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్ర దానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి సుకుమార్ బాబు మాట్లాడుతూ నేత్ర పరీక్షలు విద్యార్థులు అందరూ చేయించుకోవాలని తద్వారా కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పట్నాయక్, నేత్ర వైద్య సహాయకురాలు ఉమామహేశ్వరి, ఆరోగ్య కార్యకర్త నారాయణమ్మ, ఆశ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 15న ఇంజినీర్స్ డే

పార్వతీపురం: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న ఇంజినీర్స్‌డేను పీఆర్ ఇంజినీర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఫోరం ప్రతినిధులు బి.లక్ష్మణరావు, రత్నాకర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పీఆర్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు ప్రారంభించనున్నట్లు చెబుతూ విజయవంతం చేయాలని కోరారు.

# పురుగు మందులతో అప్రమత్తం

- స్ప్రే చేసినప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి



పొలంలో మందు స్ప్రే చేస్తున్న రైతు

బలిజిపేట: క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతక సమస్యలు ఎదురయ్యే ప్రమాదముందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంటలలో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసురోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు.

**రసాయనాలతో అనారోగ్య సమస్యలు**

పంటలను ఆశించే చీడపీడల నివారణకు రైతులు క్రిమిసంహారక మందులు వేస్తుంటారు. జాగ్రత్తలు పాటించకపోతే క్యాన్సర్, గుండెజబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, నరాల బలహీనత వంటి ప్రమాదాల బారిన పడే ఆస్కారముందని చెబుతున్నారు. మందులు పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకం వల్ల వాటి అవశేషాలు పంటలపై చాలాకాలంగా ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతారంటున్నారు.

**సేంద్రియ సాగు మేలు**

సేంద్రియ సాగు విధానాన్ని అనుసరించడం వల్ల నేలలో సారం ఎక్కువగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చు. పశువుల వ్యర్థాలు, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్టు వంటివి వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుంది. మందులు ఎక్కువగా వినియోగించడం వల్ల కీటకాలు వ్యాధి నిరోధక శక్తిని పొందుతాయి. దీనివల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాఖ ఏఓ శ్రావణ్ చెబుతున్నారు. ఇంకా మందులు వినియోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండే దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం, భోజనం చేయరాదు.
- పిచికారీ మందు కోసం వాడే స్ప్రేయర్‌లు కండిషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి.
- పురుగు, తెగులు మందులను కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రతో కలపాలి.
- ఆహార పదార్థాలతో పాటు కీటక నాశక మందులను రవాణా చేయరాదు.
- పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా ప్రత్యేక గదిలో ఉంచాలి.
- పురుగు మందులు వినియోగించే ముందు వాటిపై వివరాలను బాగా పరిశీలించాలి. డబ్బాలపై రంగు ముద్రలను కూడా పరిశీలించాలి.
- నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదు.
- ప్రమాదవశాత్తు మందు కళ్లలో పడితే వెంటనే మంచినీటితో శుభ్రం చేసుకోవాలి.
- కీటక నాశక మందుల డబ్బాలను ఖాళీ అయిన వెంటనే గొయ్యితీసి అందులో పూడ్చిపెట్టాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరచుకోవాలి.
- ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి, డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగుమందుల వివరాలను డాక్టర్‌కు తెలియపరచాలి.
- పిచికారీ పూర్తయిన అనంతరం స్ప్రేయర్ల ట్యాంక్ బయట, లోపల శుభ్రంగా కడిగి వాటి బాగాలకు ఇంజిన్ ఆయిల్ పట్టించి జాగ్రత్తపరచాలి.

## జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పెదబొండపల్లి, మున్సిపాలిటీ పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 105రకాల మందులు, 14రకాల డయోగ్నొస్టిక్స్ పరీక్షలు ఉంటాయన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైన వారికి గ్రామాల్లోనే శిబిరాలను నిర్వహించి వైద్యం అందజేయనున్నామని తెలిపారు. వైద్యశిబిరాలకు స్పెషలిస్టు డాక్టర్లు ఇద్దరు, మండలంలోని పీహెచ్‌సీ డాక్టర్లు ఇద్దరు హాజరవుతారన్నారు. సెప్టెంబర్ 30న మొదటి వైద్యశిబిరం ఉంటుందని, అక్టోబర్ నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ పూర్తవుతుందని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు, వైద్యాధికారులు తదితరులున్నారు.